



SRI TV

శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022




# వైసీపీకి ఓటేస్తే భావి తరాలకు తీరని అన్యాయం చేసినట్లే



- ★ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏం మేలు జరిగిందో మీకు మీరే ప్రశ్నించుకోండి
- ★ జనసేన పార్టీ సమస్య గురించి మాట్లాడితే.. అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారు
- ★ ఇక నుంచి సీబీఐ దత్తపుత్రుడు అనే పిలుస్తాను
- ★ ఎవరికీ దత్తత వెళ్ళలేదు... నేను ప్రజలకు దాసుణ్ణి
- ★ ఆత్మహత్య చేసుకున్న ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక
- ★ రైతుల మధ్య కులాల కుంపటి పెట్టాలని చూస్తున్నారు
- ★ చింతలపూడి రచ్చబండ వేదికపై నుంచి జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్

కౌలు రైతు సమస్యను వైసీపీ ప్రభుత్వం గుర్తించకపోవడం వల్లే జనసేన పార్టీ బయటకు తీసుకొచ్చిందని పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. 151 మంది శాసనసభ్యులు, 22 మంది లోక్ సభ సభ్యులు, ఆరుగురు రాజ్యసభ సభ్యులు నిజంగా కౌలు రైతుల సమస్యలను గుర్తించి పరిష్కారం చూపించి ఉంటే జనసేన పార్టీ రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. భారతదేశంలో రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉండటం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దాదాపు మూడు వేల మంది కౌలు రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని, ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా జనసేన పార్టీ ముందడుగు వేస్తోందని వెల్లడించారు. కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడిలో రచ్చ బండ నిర్వహించారు. ఆత్మహత్యలకు పాల్పడిన 41 మంది కౌలు రైతుల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “భారత దేశంలో 80 శాతం మంది కౌలు రైతులే. మనం తినే ప్రతి మెతుకు వాళ్ల శ్రమతో పండించిందే. అప్పులు చేసి సాగుపై పెట్టుబడులు పెడితే ప్రకృతి విపత్తులు, గిట్టుబాటు ధరలు లేక చేసిన అప్పులు తీర్చలేక నిరాశ నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కేవలం మూడంటే మూడు లక్షల అప్పు తీర్చలేక తనువు చాలిస్తున్న వారు ఉన్నారు. కొందరు పొలాల్లో చెట్లకు ఉరివేసుకుంటే, మరికొంతమంది పురుగుల మందులు తాగి చనిపోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల బాధలు వింటుంటే కడుపు తరుక్కుపోతోంది. పట్టాదారు పాస్ పుస్తకంలో పొరపాట్ల సవరణ కోసం గుంటూరు జిల్లాలో ఒక రైతు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి చివరకు ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధ అనిపించింది. ఇలాంటి వాళ్ల బాధలు తీర్చాల్సింది ప్రభుత్వం కాదా?

## జనసేన ఎత్తుకుంటేగానీ సమస్య గుర్తురాదా?

ఎన్నికల ముందు నేటి ముఖ్యమంత్రి పాదయాత్ర సమయంలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతేనే నిలదీయాల్సి వస్తోంది. ప్రజలు మిమ్మల్ని నమ్మి బలమైన మెజార్టీ ఇస్తే వారి కన్నీరు తుడవాలి కదా? కష్టమొస్తే ప్రజలకు అండగా నిలబడాలి కదా? కన్నీరు తుడవాల్సింది కేవలం పాదయాత్ర సమయంలో కాదు...అధికారంలోకి వచ్చాకా వారికి భరోసా కల్పించాలి. జనసేన పార్టీ ఏ సమస్య అయినా ఎత్తుకుంటే తప్ప ఈ ప్రభుత్వానికి గుర్తురాదా? అధికారం చేతిలో ఉంది.. ప్రజల్ని ఆదుకోండని మేము అడిగితే... వారు అవన్నీ మానేసి దత్తపుత్రుడు, ఆ పుత్రుడు అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. ఇంతవరకు ముఖ్యమంత్రి స్థానానికి మర్యాద ఇచ్చి మాట్లాడాను. ఇకమీదట ఆయన్ని సీబీఐ దత్తపుత్రుడు అని పిలవాలని ఫిక్స్ అయిపోయాం. నన్ను దత్తపుత్రుడు అని పిలిచే వైసీపీ నాయకులకు ఒకటే చెబుతున్నాను.. నేను ప్రజలకు మాత్రమే దత్తపుత్రుడిని. సమస్య పక్కదారి పడుతుందని నేను సెటైర్లు వేయను కానీ, మంచి స్క్రీన్ ప్లే రాయగల గట్టి రచయితను. నేను సెటైర్ వేస్తే వైసీపీ నాయకులు తట్టుకోలేరు. నరసాపురం ఎం.పి. రఘురామ కృష్ణం రాజు గారు కొన్ని సూచనలు చేశారు. పొరపాటు మాట్లాడారని చెప్పారు. సరి చేసుకుంటాను. అది చర్లపల్లి షటిల్ టీం కాదు చంచల్ గూడ షటిల్ టీం అని చెప్పారు. ఆయన సూచనల ప్రకారం ఇక నుంచి వైసీపీని చంచల్ గూడ షటిల్ టీం అనే పిలుస్తాను.

## నష్టపరిహారంలో కూడా కుల వివక్షేనా?

జనసేన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలో చనిపోయిన కౌలు రైతుల కుటుంబాలకు రూ. 7 లక్షల నష్టపరిహారం ఇస్తున్నారు. ఇస్తున్న నష్టపరిహారంలో కూడా కుల వివక్ష చూపిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్సీ కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా చేతులు దులుపుకుంటున్నారు.




కొనసాగింపు తదుపరి పేజీలో...

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

SRI TV




ఆదివారం, 24 ఏప్రిల్ 2022

## వైసీపీ నేతలకు సంస్కారం లేదా?

తూర్పుగోదావరి జిల్లాలో ఒక వైసీపీ ఎమ్మెల్సీ అయితే ఏదో తన సొంత జేబులో డబ్బులు ఇచ్చినట్లు రూ. 7 లక్షలను గాల్లో ఊపుతూ బాధిత కుటుంబానికి ఇస్తున్నాడు. ఇలా చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని అవమానించడం పద్ధతి కాదు. అలాగే రూ. 7 లక్షలు ఇచ్చాం కాళ్లకు మొక్కండి అని చెప్పడం సంస్కారం కాదు. వైసీపీ నేతలకు సంస్కారం లేదా? అయినా రూ. 50 వేలకు మించి విత్ డ్రా చేయకూడదని నిబంధనలు చెబుతుంటే ఈయన మాత్రం రూ. 7 లక్షలు ఎలా విత్ డ్రా చేశారు? నాయకులే ఇలా సంస్కారహీనులుగా తయారైతే ఇక ఆ పార్టీ క్యాడర్ ఎలా ఉంటుందో ఊహించుకోవాలి.



## ఆ హామీ ఏమైందని నిలదీయండి

తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ వరి పండని చోట కూడా అక్కడి రైతాంగం వరి పండిస్తుంటే.. మనం మాత్రం జీవనదులు ఉండి కూడా రైతు ఆత్మహత్యలను నిలువరించ లేకపోతున్నాం. రైతుల ఆత్మహత్యలు ఆపే విధంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం కింద రూ. 13,500 ఇస్తామని వైసీపీ హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. కేంద్రం ఇస్తున్న రూ. 6 వేలతో కలిపి రూ. 13,500 ఇస్తున్నారు. వైసీపీ ఇచ్చిన హామీ ప్రకారం అర్హుడైన ప్రతి రైతు ఖాతాలో రూ. 19,500 జమ కావాలి. రైతుకు రావాల్సిన ఆ ఆరువేల రూపాయలు ఏమయ్యాయని ఈ ప్రభుత్వాన్ని నిలదీయండి. జగన్ రెడ్డిలా నాకు లక్షల కోట్ల ఆస్తి లేదు.. సిమెంట్ ఫ్యాక్టరీలు లేవు. అలా ఉండుంటే చనిపోయిన ప్రతి కౌలు రైతుకు రూ. 7 లక్షలు నా సొంత డబ్బులే ఇచ్చేవాడిని. ఎవరో వస్తారు ఏదో చేస్తారని నమ్మేవాడిని కాదు. నా వంతు నేను ఏం చేయగలనో అది చేస్తాను. సుదీర్ఘ ప్రయాణం కూడా ఒక చిన్న అడుగుతోనే మొదలవుతుందని నమ్మేవాడిని.. కనుకే నా వంతుగా రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చాను. నన్ను నమ్మి చాలా మంది మా పార్టీ నాయకులు డొనేషన్లు ఇస్తున్నారు. వాటిని ప్రత్యేక బ్యాంకు ఎకౌంటులో వేస్తాము. మీరిచ్చిన సొమ్ము ఎవరికి వెళ్లిందో మీకు తెలిసేలా చర్యలు తీసుకుంటాం. నేను కర్మఫలాన్ని నమ్ముతాను. పదవి రాకుంటే ప్రజల దాసుడిగా పనిచేస్తాను. పదవి వస్తే పదవితో కూడిన దాసుడిగా పని చేస్తాను. రాష్ట్రంలో కౌలు రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగే పరిస్థితి ఉంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా యూరియా, ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరగనున్నాయని వార్తలు వస్తున్నాయి. రష్యా నుంచే మనం దాదాపు 40 శాతం ఎరువులను దిగుమతి చేసుకుంటాం. ఈ యుద్ధ పరిస్థితుల వల్ల గత ఏడాది రూ. 500 ఉన్న యూరియ బస్తా, ఇప్పుడు రూ. 1200 కు చేరుకుంది. ఎరువుల ధరలు దాదాపు మూడింతలు పెరిగే అవకాశం ఉంది. దీనిపై వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు రైతులకు అర్ధమయ్యే విధంగా దిశానిర్దేశం చేయాలి. వైసీపీ ప్రభుత్వం కూడా మా సూచనలు విజ్ఞతతో తీసుకోవాలని కోరుకుంటున్నాం. అలాగే డ్రిప్ ఇరిగేషన్ పై సబ్సిడి ఎత్తేశారు. డబ్బులు కట్టిన రైతులకు కూడా పరికరాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది.



## 99 సార్లు యుద్ధం వద్దు అనుకుంటాను... 100వ సారి మాత్రం...!

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వికలాంగురాలైన ఆడబిడ్డను దారుణంగా అత్యాచారం చేశారు. ఆడబిడ్డ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదు. వైసీపీ దారుణమైన పాలనతో పోలీస్ వ్యవస్థ కూడా విసిగిపోతోంది. టీఏ, డీఏలు ఇవ్వడం లేదు. ఖాకీ డ్రెస్ విలువ పోయేలా పోలీసు వ్యవస్థను వాడుకుంటున్నారు. ఇలాంటి పాలన మారాలంటే యువత బాధ్యత తీసుకోవాలి. వాళ్లు బాధ్యత తీసుకోకపోతే సమాజంలో మార్పు రాదు. నిన్న 20 మంది వైసీపీ గుండాలు జనసైనికులపై దాడులు చేశారు. కౌలు రైతుల సమస్యలు తీర్చడం చేతకాదు కానీ మా వాళ్లపై మాత్రం దాడులు చేయడానికి సంసిద్ధంగా ఉంటారు. నేను వాళ్లకు ఒకటే చెబుతున్నాను... 99 సార్లు సమస్యను శాంతియుతంగానే పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను. కాదు కూడదని విర్రవిగితే మాత్రం దానిని ఏ పద్ధతిలో చెప్పాలో నాకు బాగా తెలుసు. ఇంకోసారి జనసైనికులపై దాడులు చేస్తే మాత్రం మర్యాదగా ఉండదు.

## అధికారం ఇచ్చింది బ్రాందీ షాపులు పెట్టుకోవడానికా?

వైసీపీ ప్రభుత్వం దృష్టిలో అభివృద్ధి అంటే సారా దుకాణాలు, చికెన్, మటన్ షాపులు పెట్టడం మాత్రమే.. అవి పెట్టుకోవడానికా మీకు అధికారం ఇచ్చింది? ఈ మధ్య ఇదే జిల్లా జంగారెడ్డిగూడెంలో కల్తీసారా తాగి 40 నుంచి 50 మంది చనిపోయారు. ఒక నాయకుడు నా దగ్గరకు వచ్చి వైసీపీ మద్యం తాగితే మూడు నెలల్లో చనిపోతారు. కల్తీ సారా తాగితే మూడు రోజుల్లో చనిపోతారని చెప్పాడు. ఆయన మాటలు నిజమే అనిపించాయి. మద్యపాన నిషేధం అని చెప్పి మద్యం విచ్చలవిడిగా అమ్ముతూ, పిచ్చి పిచ్చి బ్రాండ్లు మార్కెట్లోకి దింపి అమ్ముతున్నారు. అధికారంలోకి రాగానే రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైంది? ప్రజలు బాధల్లో ఉంటే సంతోషంగా ఉండలేను. అందుకే రెండు చోట్ల ఓడిపోయినా నిలబడే ఉన్నాను. మీ బిడ్డల భవిష్యత్తు కోసం మీకు మరో అవకాశం వస్తోంది. 2024లో బాగా ఆలోచించి ఓట్లు వేయండి. మీ భవిష్యత్తు, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయండి. దీనిపై ప్రజలందరూ ఆలోచించాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో మీకు జరిగిన గొప్ప మేలు ఏంటి అనేది మీకు మీరే ప్రశ్నించుకోండి.. మీ అంతరాత్మకు సమాధానం చెప్పండి. మీ బిడ్డల భవిష్యత్తు కోసం ఎవరిని ఎన్నుకోవాలో నిర్ణయించుకోవాల"న్నారు.

SRI TV
శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022




# కౌలు రైతుల కష్టాలు ఆలకిస్తూ... ఇంటింటికీ వెళ్లి పలకరిస్తూ...



★ ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాల్లో భరోసా నింపుతూ....

★ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సాగిన శ్రీ పవన్ కళ్యాణ్ కౌలు రైతు భరోసా యాత్ర

★ 41 మంది కౌలు రైతుల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం

అప్పుల బాధలు తాళలేక కౌలు రైతుల జీవితాలు అర్థంతరంగా రాలిపోతుంటే.. ఆ కుటుంబాలు పలుకరించే దిక్కులేక, పట్టించుకునే నాధుడు లేక ఇబ్బందులు పడుతున్న వేళ మీ కోసం నేనున్నానంటూ ముందుకు వచ్చారు జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు. మొన్న అనంతపురం జిల్లాలో 30 మంది కౌలు రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం చేసిన ఆయన., ఇప్పుడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్డున పడిన అన్నదాతల కుటుంబాలలో ధైర్యం నింపారు. శనివారం జిల్లాలో నిర్వహించిన జనసేన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో బలవన్మరణాలకు పాల్పడిన కౌలు రైతుల ఇళ్లకు వెళ్లి ఆ కుటుంబాల కష్టాలు ఆలకించారు. కౌలు రైతుల కన్నీరు తుడిచేందుకు జనసేన పార్టీ ఉందన్న ధైర్యాన్ని నింపారు. ఇంటింటికీ వెళ్లి కష్టాల్లో ఉన్న ఆ కుటుంబాలను పలుకరిస్తూ.. ఆత్మహత్యలకు గల కారణాలను ఓపికగా ఆలకించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న ఆ కుటుంబాలకు జనసేన పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం ఎందుకు అందలేదో విచారించి, వారికి న్యాయబద్ధంగా అందాల్సిన రూ. 7 లక్షల పరిహారం అందే ఏర్పాటు చేయాలని జిల్లా నాయకత్వానికి సూచించారు. మార్గమధ్యంలో జానంపేట నుంచి లింగపాలెం వరకు ఐదు కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. చింతలపూడిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మరో 35 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, దెందులూరు నియోజకవర్గం జానంపేట గ్రామానికి చెందిన కౌలు రైతు శ్రీ నెరుసు మల్లికార్జునరావు సాగు నష్టాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నారు. కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా జానంపేటలోని శ్రీ మల్లికార్జునరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను ఆయన భార్య శ్రీమతి శివదుర్గను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాన్ని ఓదార్చి రూ. లక్ష ఆర్థిక సాయం అందచేశారు. ఆ కౌలు రైతు బిడ్డల భవిష్యత్తుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందే వరకు వదిలిపెట్టమని హామీ ఇచ్చారు.

★ కౌలు రైతు బిడ్డ చదువు బాధ్యత తీసుకుంటాం

చింతలపూడి నియోజకవర్గం, ధర్మాజీగూడెంలో మరో కౌలు రైతు శ్రీ దాసరి రాజారావు కుటుంబాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారు పరామర్శించారు. ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి అప్పులపాలైన శ్రీ రాజారావు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు వయసు మళ్లిన తల్లిదండ్రులు, కుమారుడు ఉన్నారు. తండ్రి శ్రీ సుసి, తల్లి శ్రీమతి మరియమ్మలను ఓదార్చి ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని చెక్ రూపంలో అందించారు. చిన్నారి అఖిల్ చదువు బాధ్యతలను జనసేన పార్టీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు.



★ బిడ్డల భవిష్యత్తు బాధ్యత మాదే

మఠంగూడెంకు చెందిన కౌలు రైతు శ్రీ శ్రీకాకొల్లు బాబురావు అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్నారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శ్రీ బాబురావు మరణం తరువాత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకు జనసేన పార్టీ తరఫున రూ. లక్ష ఆర్థిక సాయాన్ని శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆయన భార్య శ్రీమతి వెంకటేశ్వరమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా కుమార్తెలు ముగ్గురినీ పలకరించిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు వారి చదువుల గురించి ఆరా తీశారు. బిడ్డల చదువులకు ఎటువంటి ఆటకం ఏర్పడకుండా జనసేన పార్టీ బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. 7 లక్షల నష్టపరిహారం అందేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ కొటికలపూడి గోవిందరావుకు సూచించారు. చింతలపూడి నియోజకవర్గం, సుందరరావు పేటకు చెందిన కౌలు రైతు శ్రీ యర్రా రాంబాబు రెండు సంవత్సరాల క్రితం అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా శ్రీ రాంబాబు తల్లి శ్రీమతి సుబ్బమ్మ ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ తరఫున రూ. లక్ష ఆర్థిక సాయం అందచేశారు. తన తండ్రి చనిపోయి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం తరఫున ఒక్కరు కూడా తమ గడప తొక్కలేదని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఎదుట బాధితుని కుమారుడు వాపోయారు. లింగపాలెంకు చెందిన శ్రీ భుక్యా వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి రూ. లక్ష ఆర్థిక సాయం అందచేశారు.

కొనసాగింపు తదుపరి పేజీలో...

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022





తమ కుమారుడు చనిపోయి ఆరు నెలలు గడచిందని ప్రభుత్వం తరపున వాలంటీర్ మినహా అదీ శ్రీ పవన్ కళ్యాణ్ గారు వస్తున్నారని తెలిసిన తర్వాత ఫోన్ మాత్రమే చేసిన విషయాన్ని వివరించారు. బలవన్మరణాలకు పాల్పడి జనసేన పార్టీ నుంచి ఆర్ధిక సాయం అందుకున్న ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా ఒత్తిడి తీసుకురావాలని పార్టీ జిల్లా నాయకులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



★ పశ్చిమలో జనసేనానికి అపూర్వ సాగతం

కౌలు రైతు భరోసా యాత్ర కోసం పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చిన జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి దారి పొడుగునా పార్టీ శ్రేణులు, ప్రజలు, ఆడపడుచులు అపూర్వ స్వాగతం పలికారు. యాత్ర కోసం కలపర్రు టోల్ గేట్ వద్ద జిల్లాలోకి అడుగు పెట్టిన ఆయనకు వేలాదిగా జనసైనికులు, పార్టీ నాయకులు ఎదురు వచ్చి ఆహ్వానం పలికారు. క్రేన్లు పెట్టి మరీ భారీ గజమాలలు వేసి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రైతులకు అండగా జనసేనాని అంటూ రహదారి మొత్తం హోర్డింగులతో నింపేశారు. ఆడపడుచులు హారతులు పట్టగా, వయసు మళ్లిన వృద్దులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి కోసం గంటల తరబడి వేచిచూశారు. ఏలూరు బై పాస్ నుంచి చింతలపూడి వరకు శ్రీ పవన్ కళ్యాణ్ గారి పర్యటనకు తరలివచ్చిన ప్రజలు, జనసైనికులతో కిక్కిరిశాయి. రహదారులతో పాటు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఇళ్లు కూడా జనంతో నిండిపోయాయి. ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ శ్రీ పవన్ కళ్యాణ్ గారు ముందుకు కదిలారు. తూర్పు గోదావరి, విశాఖ, కృష్ణా జిల్లాల జనసేన నేతలు శ్రీ కందుల దుర్గేశ్, శ్రీ సుందరపు విజయ్ కుమార్, శ్రీ మర్రెడ్డి శ్రీనివాస్, శ్రీ మేడా గురుదత్ ప్రసాద్, శ్రీ టి.ఉదయ్ శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




★ శ్రీ పవన్ కళ్యాణ్ చెంతకు సమస్యల చిట్టాలు

కౌలు రైతు భరోసా యాత్ర కోసం పశ్చిమ గోదావరి జిల్లాకు వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ గారికి దారిపొడుగునా ప్రజలు తమ సమస్యలు చెప్పుకొన్నారు. విద్యుత్ కోతలు, ఛార్జీల మోతలతో పాటు రైతుల సమస్యలు, అస్థవ్యస్థంగా ఉన్న రహదారుల సమస్యలు, కొంత మంది వ్యక్తిగతంగా తమ ఇబ్బందులను కూడా శ్రీ పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకువచ్చారు. విజయరాయిలో మొక్కజొన్న ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు రోడ్డు మీదకు రాగా, వాహనం నుంచి దిగి మరీ వారిని పేరు పేరునా పలకరించారు.

## జగన్ రెడ్డి దమ్ము ఏంటో.. జనసేన దమ్ము ఏంటో చూపిద్దాం!

★ ఎన్నికల వేళ రాజకీయాలు చేద్దాం.. రైతులను ఆదుకునే విషయంలో కాదు
★ ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ విమర్శలు చేయడానికి ముఖ్యమంత్రికి సిగ్గుండాలి
★ కరెంటు కోతలతో రైతాంగం అల్లాడుతోంది
★ ఈ ముఖ్యమంత్రికి మానవత్వం లేదు
★ చింతలపూడి రచ్చబండ వేదికపై జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్




'ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు ప్రారంభించినప్పుడు దాని గురించి మాట్లాడాలి.. పాలన గురించి ప్రజలకు వివరించాలి. దానిని పూర్తిగా పక్కన పెట్టి రాజకీయ విమర్శలకు దిగడం ముఖ్యమంత్రి జగన్ రెడ్డికే చెల్లింద'ని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు స్పష్టం చేశారు. జనసేన పార్టీ చేపట్టిన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి లో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడారు. కౌలు రైతుల సమస్యలు కనీసం పట్టించుకోని ప్రభుత్వం తీరు అత్యంత దారుణం అన్నారు. చింతలపూడి రచ్చబండ వేదిక నుంచి శ్రీ నాదెండ్ల మనోహర్ గారు ప్రసంగిస్తూ "ప్రభుత్వ వేదికలపై ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమాల గురించి కాకుండా జనసేన పార్టీని విమర్శించడం ఏమిటి? ఈ ముఖ్యమంత్రికి సిగ్గు ఉండాలి. ప్రభుత్వ కార్యక్రమాల వేదికపై రాజకీయ విమర్శలు చేయకూడదు అన్న జ్ఞానం ఉండాలి. భయంతో మాట్లాడే మాటలు ఆపి, రైతులను ఆదుకునే దారి చూడాలి. వారి కుటుంబాలను పరామర్శించాలి. హామీ ఇచ్చినట్లుగా వారికి ఏడు లక్షల రూపాయల సహాయం వెంటనే అందించాలి. అంతేగాని ప్రజా వేదికలపై ఇష్టానుసారం మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. మూడు వేల మంది రైతులు మూడు సంవత్సరాల్లో ఆత్మహత్యలు చేసుకుంటే ఈ ప్రభుత్వానికి కనీసం పట్టడం లేదు. కొన్ని జిల్లాల్లో రైతుల ఆత్మహత్యలను నమోదు చేయడానికి సైతం అధికారులు ముందుకు రాకపోవడం దురదృష్టకరం. 11 మంది చింతలపూడి నియోజకవర్గంలో, ఏడుగురు పోలవరం నియోజకవర్గంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో 370 మంది, అనంతపురం జిల్లాలో 170 మంది ఆత్మహత్య చేసుకున్నారు. అన్నపూర్ణ లాంటి ఉభయగోదావరి జిల్లాల్లోనూ 87 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకోవడం శోచనీయం. మూడో నాలుగో ఎకరాలు కౌలుకు చేసుకొని కుటుంబాన్ని ఎలాగోలా నెట్టుకువద్దామని రైతులు సాగు చేస్తున్నారు. పంట నష్టం, గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులకు సమాధానం చెప్పలేక కన్నబిడ్డలను వదిలి బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దానిపైన ఈ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అన్నదాతల ఆత్మహత్యలు నివారించే మార్గాన్ని చూడాలి.

★ కరెంటు కోతలతో రైతాంగం అల్లాడుతోంది

ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ ఎన్నికల్లో అన్ని వర్గాలను మభ్యపెట్టి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారు. రాష్ట్రంలో కరెంటు చార్జీల బాదుడు ఒకపక్క... కరెంట్ కోతల మోత మరో పక్క అన్నట్లుగా ఉంది. ప్రస్తుతం పంట కీలకదశలో ఉన్న సమయంలో కరెంటు లేక రైతాంగం అల్లాడుతోంది. పంటకు నీరు అందక, కరెంటు కోతలతో రైతాంగం సతమతమవుతోంది. దీనిని వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలి. రాష్ట్రాన్ని అంధ కారంలోకి నెట్టేసిన ఈ ముఖ్యమంత్రి దీనికి సమాధానం చెప్పాలి. కౌలు రైతుల భరోసా యాత్ర కోసం శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఎంతో ఆలోచించి ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. అసలు కౌలు రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు..? వారికి వచ్చిన కష్టం ఏంటి? ప్రభుత్వం వారి ఆత్మహత్యల మీద ఎందుకు స్పందించడం లేదు? ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల పరిస్థితి ఏమిటి? అనే అనేక అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఈ యాత్ర మొదలుపెట్టారు.

కొనసాగింపు తదుపరి పేజీలో...

శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం




ఆదివారం, 24 ఏప్రిల్ 2022



రైతు కుటుంబాలకు భరోసాగా ఉండడానికి ఆయన వంతుగా రూ.ఐదు కోట్ల విరాళం ఇచ్చి.. ప్రతి కుటుంబానికి అండగా నిలిచేందుకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇది ప్రతి జనసేన కార్యకర్త ఛాతి ఉప్పొంగి చెప్పే గొప్ప కార్యక్రమం. దీనిని ప్రతి కార్యకర్త బాధ్యతగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళండి. కార్యక్రమం గొప్పదనాన్ని ప్రజలకు వివరించండి. ప్రభుత్వం కౌలు రైతులను ఎలా మోసం చేసిందో వివరించండి. ఎన్నికల వేళ రాజకీయాలు మాట్లాడదాం... జగన్ రెడ్డి దమ్ము ఏంటో.. జనసేన దమ్ము ఏంటో చూపిద్దాం. కౌలు రైతుల భరోసా యాత్ర ఇప్పటికే జనంలోకి వెళ్లింది. దీనిని మరింతగా జనసేన కార్యకర్తలు ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయండి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు కౌలు రైతు భరోసా యాత్ర కోసం పవన్ కళ్యాణ్ గారు వస్తున్నారని తెలుసుకున్న ఓ యువకుడు నిన్న వచ్చి కలిశాడు. తన తండ్రి సాగు కు సంబంధించి అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని నా దృష్టికి తీసుకు వచ్చాడు. వెంటనే అధ్యక్షుల వారి అనుమతితో వారికి కూడా సహాయం అందించే ఏర్పాటు చేశాం. ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి అనేది శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆకాంక్ష. దానిని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్దాం.

★ కర్షకుడికి కులం ఏంటి?

అందరి కడుపు నింపే కర్షకుడికి సాయం అందించడంలో కులం ఎందుకు ప్రస్తావన వస్తోంది.? ప్రతి కులంలోనూ పేదలు ఉన్నారు. ఎంతో కొంత సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వారు ఉన్నారు. రైతు భరోసా సాయం కోసం కులం వారిగా లెక్కలు చూసి వారికి సాయం అందించడం అత్యంత హేయం. ప్రభుత్వం రైతులకు సైతం కులం చూసి సాయం చేయడం ఎక్కడ లేదు. పాదయాత్ర వేళ ఎన్నో హామీలను రైతాంగానికి ఇచ్చిన ముఖ్యమంత్రి పదవి లోకి వచ్చాక వాటిని పూర్తిగా మరిచి పోయారు. వాటిని మొదట పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో రైతులకు సబ్సిడీ లు లేవు. మద్దతు ధర లేదు. గిడ్డంగులు కట్టడమే మరిచిపోయారు. ఇన్ని సమస్యలను కళ్లెదుటే పెట్టుకొని ఉన్న ముఖ్యమంత్రి జనసేన పార్టీ చేస్తున్న సహాయం విషయంలో చౌకబారు విమర్శలకు దిగడం మానుకుంటే మేలు.

★ ఇలాంటి ముఖ్యమంత్రి మనకొద్దు

రైతులను ఆదుకోవడానికి ఎన్ని విమర్శలు ఎదుర్కొనేందుకు అయినా జనసేన పార్టీ సిద్ధంగానే ఉంది. కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం పరామర్శించని ఈ మానవత్వం లేని ముఖ్యమంత్రి మనకొద్దు. ఏ రైతు అధైర్యపడాల్సిన అవసరం లేదు. రైతు కష్టాలు తెలిసిన పవన్ కళ్యాణ్ గారు మీ వెంట ఉన్నారు. వారికి అండగా నిలుస్తాం. ఖచ్చితంగా ప్రతి రైతును ఆదుకునే వరకూ రైతు భరోసా యాత్ర కొనసాగుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి కౌలు రైతులకు ఇస్తామని చెప్పిన ఏడు లక్షల రూపాయల నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాల"న్నారు.



★ రైతుల కళ్లలో ఆనందం నిండాలి... అదే జనసేన ఆకాంక్ష: పార్టీ పీఏసీ సభ్యులు శ్రీ నాగబాబు

జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఎవరి గురించి అయినా ఆలోచిస్తే, వారి క్షేమం కోసం ఏదైనా చేస్తే వారి జీవితాలు అద్భుతంగా బాగుపడతాయని జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు శ్రీ కొణిదల నాగబాబు గారు అన్నారు. జనసేన పార్టీ తలపెట్టిన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా చింతలపూడిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ "రాష్ట్రంలోని రైతుల సమస్యలు తీరి, వారి జీవితాల్లో నవ కాంతులు రావాలని ఆకాంక్షిస్తున్నాం. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలనే గొప్ప ఆలోచనే అద్భుతం. జనసేన పార్టీ సైనికుడిగా, ఒక గొప్ప నాయకుడు ఆధ్వర్యంలో పని చేస్తున్నానన్న గర్వం ఎప్పటికి ఉండిపోతుంది. కౌలు రైతులను ఆదుకోవాలని గొప్ప తలంపుతో ఇలాంటి కార్యక్రమం ప్రారంభించాలని అనుకుంటున్నట్లు శ్రీ పవన్ కళ్యాణ్ గారు చెప్పినపుడు మాలో ఎంతగానో స్ఫూర్తి నింపింది" అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు శ్రీ కొటికలపూడి గోవిందరావు ఆధ్వర్యంలో ఈ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పి.ఎ.సి. సభ్యులు శ్రీ కనకరాజు సూరి, శ్రీ ముత్తా శశిధర్, మత్స్యకార వికాస విభాగం ఛైర్మన్ శ్రీ బొమ్మిడి నాయకర్, పార్టీ నేతలు శ్రీ మేకా ఈశ్వరయ్య, శ్రీ విడివాడ రామచంద్రరావు, శ్రీ కరాటం సాయి, శ్రీ చెన్నమళ్ళ చంద్రశేఖర్, శ్రీమతి కాట్నం విశాలి, శ్రీమతి కడలి ఈశ్వరి, శ్రీ మల్నీడి బాబీ, శ్రీ పి.ధర్మరాజు, శ్రీ శెట్టిబత్తుల రాజబాబు, శ్రీ సంగిశెట్టి అశోక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు శ్రీమతి ఘంటసాల వెంకటలక్ష్మి, శ్రీమతి ప్రియా సౌజన్య, శ్రీమతి గంటా స్వరూప, శ్రీ అమ్మిశెట్టి వాసు, శ్రీ బోడపాటి శివదత్ తదితరులు పాల్గొన్నారు.



## జానంపేట కౌలు రైతు మల్లికార్జున రావు కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం

శతఘ్ని న్యూస్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన కౌలు రైతు భరోసా యాత్ర శనివారం ఉదయం ప్రారంభమైంది. యాత్రలో భాగంగా దెందులూరు నియోజకవర్గం జానంపేట గ్రామంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తొలి చెక్కు అందచేశారు. కౌలు రైతు నెరుసు మల్లికార్జునరావు సాగు నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన కుటుంబాన్ని పవన్ కళ్యాణ్ పరామర్శించారు. సాగు నష్టాలు, చేసిన అప్పులు తీర్చలేక నెరుసు మల్లికార్జున రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన భార్య శ్రీమతి శివదుర్గను ఓదార్చిన పవన్ కళ్యాణ్ .. పార్టీ తరఫున లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సాయంతోపాటు ఇద్దరు ఆడ బిడ్డల భవిష్యత్తుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ తో పాటు పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పీఏసీ సభ్యులు నాగబాబు, జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, పార్టీ నాయకులు ఘంటసాల వెంకట లక్ష్మి, శ్రీ బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.

SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022







## సుందరరావుపేటలో కౌలు రైతు యర్రా రాంబాబు కుటుంబానికి ఆసరా

శతఘ్ని న్యూస్: సాగు నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన కౌలు రైతు యర్రా రాంబాబు కుటుంబాన్ని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పరామర్శించారు. చింతలపూడి నియోజకవర్గం సుందరరావు పేట గ్రామానికి వెళ్లి రాంబాబు తల్లి శ్రీమతి సుబ్బమ్మ, కుమారుడు రమేష్‌లను ఓదార్చారు. పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు తల్లి శ్రీమతి సుబ్బమ్మ మాట్లాడుతూ... మా అబ్బాయి చనిపోయి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఏ నాయకుడు కూడా మమ్మల్ని పట్టించుకోలేదు. ఒక్క అధికారి కూడా మా ఇంటి గడప తొక్కలేదని వాపోయారు. మీరు మాత్రమే మా కష్టాలు తెలుసుకొని మా ఇంటికి వచ్చి ఆదుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ తో పాటు పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



## మట్టంగూడెంలో కాకొల్లు బాబురావు కుటుంబానికి అండ

శతఘ్ని న్యూస్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన పార్టీ కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా చింతలపూడి నియోజవర్గం మట్టంగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు కాకొల్లు బాబురావు కుటుంబాన్ని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పరామర్శించారు. బాబురావు వ్యవసాయంలో తీవ్ర నష్టాలు రావడంతో అప్పులపాలై ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాబురావు మరణం తరువాత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకు జనసేన పార్టీ తరఫున రూ. లక్ష ఆర్థిక సాయాన్ని పవన్ కళ్యాణ్ ఆయన భార్య వెంకటేశ్వరమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా కుమార్తెలు ముగ్గురినీ పలకరించిన పవన్ కళ్యాణ్ వారి చదువుల గురించి ఆరా తీశారు. బిడ్డల చదువులకు ఎటువంటి ఆటకం ఏర్పడకుండా జనసేన పార్టీ బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ. 7 లక్షల నష్టపరిహారం అందేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ తో పాటు పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



## ధర్మాజీగూడెంలో కౌలు రైతు దాసరి రాజారావు కుటుంబానికి చేయూత

శతఘ్ని న్యూస్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి నియోజకవర్గం ధర్మాజీగూడెం ప్రాంతానికి చెందిన కౌలు రైతు దాసరి రాజారావు ఆర్థిక ఇబ్బందులతో మూడేళ్ల క్రితం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారు. జనసేన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ధర్మాజీగూడెంలో రాజారావు కుటుంబాన్ని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జనసేన పార్టీ తరఫున ప్రకటించిన రూ. లక్ష ఆర్థిక సాయాన్ని చెక్ రూపంలో ఆయన తల్లిదండ్రులు శ్రీమతి మరియమ్మ, సుశీలకు అందజేశారు. రాజారావు కుమారుడు అఖిల్ విద్య బాధ్యతలను జనసేన పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ తో పాటు పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ గారు, పీఏసీ సభ్యులు నాగబాబు, జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, పార్టీ నాయకులు శ్రీమతి ఘంటసాల వెంకట లక్ష్మీ, శ్రీ బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు.




## లింగపాలెం కౌలు రైతు భుక్యా వెంకటేశ్వరరావు కుటుంబానికి భరోసా

శతఘ్ని న్యూస్: పశ్చిమ గోదావరి జిల్లా లింగపాలెంకు చెందిన కౌలు రైతు భుక్యా వెంకటేశ్వరరావు అప్పుల పాలై ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. అతనికి వయసు మళ్లిన తల్లిదండ్రులు ఉన్నారు. జనసేన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా శనివారం లింగపాలెంకు వచ్చిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరఫున రూ. లక్ష ఆర్థిక సాయం చెక్ రూపంలో అందచేశారు. తమ కుమారుడు చనిపోయి ఆరు నెలలు గడచినా ప్రభుత్వం తరఫు నుంచి పలుకరించే దిక్కు లేదని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు తల్లి శ్రీమతి మారెసు పవన్ కళ్యాణ్ వద్ద వాపోయారు. వాలంటీర్ మినహా ఎవ్వరూ ఫోన్ చేయలేదనీ, అదీ మీరు వస్తున్నారని తెలిసిన తర్వాతే ఫోన్ వచ్చిందని తెలిపారు. కౌలు చేసి అప్పులపాలై తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి అధికారులు ఎవ్వరూ తమ ఇంటికి రాలేదని చెప్పారు. వెంకటేశ్వరరావు ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్న పవన్ కళ్యాణ్ పార్టీ తరఫున ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా పార్టీ తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
ఆదివారం, 24 ఏప్రిల్ 2022




# పెంచిన ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని దేవర మనోహర ఆధ్వర్యంలో నిరసన

★పెంచిన ఆర్టీసీ చార్జీలు వెంటనే తగ్గించాలని జనసేన పార్టీ నాయకుల డిమాండ్

శతఘ్ని న్యూస్: చంద్రగిరి నియోజకవర్గ హెడ్ కోటర్స్, చంద్రగిరి టవర్ క్లాక్ దగ్గర జిల్లా కార్యదర్శి దేవర మనోహర ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దేవర మనోహర మాట్లాడుతూ.. ప్రజలపై బాదుడికి బ్రాండ్ అంబాసిడర్ మరియు 31 కేసులు ఉన్న సీబీఐ దత్తపుత్రుడు, చెత్త పై కూడా పన్ను వేసిన చెత్త పుత్రుడు.. అప్పెక్కడ పుడుతుందోనని వెతికే అప్పు పుత్రుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.

వైసీపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి సామాన్యులపై పెనుభారం మోపుతొందన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కి, ఎమ్మార్వో మరియు ఎంపీడీవో కి సమర్పించారు.

రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని మాట్లాడుతూ.. ఎడ్లబండి దశనుంచి మెట్రో వరకూ.. ఆధునిక దిశగా అడుగులు వేస్తున్న మనల్ని తిగిరి మళ్లీ అదే ఎడ్లబండి దశకు తీసుకెళ్తున్న వైసిపి ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ.. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెంచిన ధరను తగ్గించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఇదే విధంగా కొనసాగితే వైసీపీ ప్రభుత్వాన్ని ఓఎల్ఎక్స్ లో పెట్టుకోవాల్సి వస్తుంది అని ఎద్దేవా చేశారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవి హరి, వినోద్ మరియు మండల నాయకులు మురళి, వేణు, ధరణి, ఐతేపల్లి సాయి, జనసేన సాయి, యువరాజ్, ఆశ, కిరణ్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# రామ్మోహన్ రావు నాయకత్వంలో బాదుడే...బాదుడు నిరసన

శతఘ్ని న్యూస్: శ్రీకాకుళం జిల్లా, ఆముదాలవలస నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం వేస్తున్న పన్నులు భారానికి శనివారం ఆమదాలవలస నియోజకవర్గంలో పేడాడ. రామ్మోహన్ రావు నాయకత్వంలో బాదుడే...బాదుడు అనే నినాదాలతో హోరెత్తించి కాగడాలతో నిరసన ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని మరీ ముఖ్యంగా విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలు, నిత్యావసర సరుకుల,ఇంటి పన్ను, చెత్త పన్ను ఎలా బాదుడే బాదుడు కార్యక్రమం పెట్టుకున్నారని వీటన్నిటినీ తక్షణమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పైడి మురళీ మోహన్, చిన్నమ నాయుడు, గణేష్, రమణ, ధనుంజయ, అప్పలరాజు, శివ, ఫణి కుమార్, పవన్, శ్రీనివాస్, రాజశేఖర్, కోటేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.




# కౌలు రైతు భరోసా యాత్రలో కందుల దుర్గేష్

శతఘ్ని న్యూస్: పశ్చిమగోదావరి జిల్లా కౌలు రైతు భరోసా యాత్రలో చింతలపూడి గ్రామంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని కలిసిన తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ పిఏసి మెంబర్ ముత్తా శశిధర్ కాకినాడ నగర అధ్యక్షులు సంగిశెట్టి అశోక్.



# రైతు భరోసా యాత్రకు రమేష్ బాబు లక్ష విరాళం



శతఘ్ని న్యూస్: రాజోలు, రైతులకు అండగా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఐదు కోట్ల రూపాయలు అందజేయడం జరిగింది. ఆయన స్ఫూర్తితో రాజోలు నియోజకవర్గం తరుపున పింక్ హార్ట్స్ ఫౌండేషన్ ఫౌండర్ మరియు చింతలమోరి సర్పంచ్ జనసేన నాయకులు, మనవత్వాధీర డాక్టర్ రాపాక రమేష్ బాబు గారు రైతులను ఆదుకునే విధంగా తన వంతు బాధ్యతగా జనసేన పార్టీకి 1 లక్ష రూపాయలు విరాళం ప్రకటించడం జరిగింది.

# మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జనసేన డిమాండ్

శతఘ్ని న్యూస్: హిందూపురం మునిసిపాలిటీలో విధులనుండి తొలగించిన 85 మంది మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని గత 6 రోజులుగా సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు జరుగుతున్న రిలే నిరాహారదీక్షకు హిందూపురం జనసేన పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు తెలియచేసి కరోన సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన కార్మికులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని, విధులనుండి తొలిగించబడిన 85 మంది పారిశుద్ధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయవలసిందిగా జనసేన పార్టీ తరుపున డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరుపున కార్మికులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేసి, దీక్షాస్థలి ఖర్చుకు జనసేన పార్టీ హిందూపురం మండల అధ్యక్షుడు చక్రవర్తి 5 వేల రూపాయలు విరాళం అందించాడు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ హిందూపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఆకుల ఉమేష్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మకాయల రాము, కార్మిక నాయకుడు ఎం ఎం మంజునాథ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కొల్లకుంట శేఖర్, హిందూపురం మండల అధ్యక్షుడు చక్రవర్తి, జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు నాగరాజు, జనసేన నాయకులు భాస్కర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022




## రైతు భరోసా యాత్రలో భాగంగా నిడదవోలు జనసేన

శతఘ్ని న్యూస్: జనసేన పార్టీ కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా నిడదవోలు జనసేన నాయకులు చింతలపూడి కార్యక్రమానికి హాజరవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉలుసు సౌజన్య, తులా చినబాబు, పాల వీరాస్వామి, కాకర్ల నాని, నిడదవోలు మండల అధ్యక్షులు పోలీరెడ్డి వెంకటరత్నం హాజరవ్వడం జరిగింది.




## జనసేన పిఏసి సభ్యులు నాగబాబుని కలసిన క్రియాశీలక సభ్యులు

శతఘ్ని న్యూస్: తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాజమండ్రి విచ్చేసిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు రాజకీయ వ్యవహారాల కమిటి సభ్యులు కొణిదల నాగబాబుని స్థానిక షెల్టాన్ హోటల్ లో రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలో వివిధ వార్డుల్లో ఉన్న పార్టీ క్రియాశీలక సభ్యులు మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. నగరంలో వేలాది మంది వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవటం విధితమే, ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ నగరంలో పార్టీని బలోపేతం దిశగా తీసుకువెళ్ళాలని, నగర అధ్యక్షులు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందుకు వెళ్ళాలని తెలియజేసారు. వై.శ్రీనివాస్ క్రియాశీలక సభ్యులను నాగబాబుకు పరిచయం చేసారు. వై.శ్రీనివాస్ మరియు క్రియాశీలక సభ్యులు నాగబాబుకి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తో కూడిన ఫొటో ఫ్రేమ్ అందజేసి సత్కరించారు. ఈ సమావేశంలో భారీ సంఖ్యలో క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.



## ఇచ్ఛాపురం జనసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

శతఘ్ని న్యూస్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కండ్రవీధిలో ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త దాసరి రాజు ఆధ్వర్యంలో "జేమ్స్ హాస్పిటల్" వైద్య బృందం సౌజన్యంతో శనివారం నాడు "ఉచిత మెగా వైద్య శిబిరం" బెహరా సంఘ అధ్యక్షులు జితేంద్ర బెహరా ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో కిడ్నీ, గుండె, కేన్సర్ మరియు సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరిగినది. 410 మందికి బీపి, షుగర్, ఈసీజి వైద్య పరీక్షలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జేమ్స్ డాక్టర్స్ హూహస్ రెడ్డి, పవన్ భార్గవ్, సూర్య వంశీ మరియు జనసేన రాష్ట్ర సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి, మత్స్యకార విభాగ వికాస కార్యదర్శి హరి బెహరా మున్సిపాలిటీ వార్డు ఇంచార్జ్ లు రోకళ్ళ భాస్కర్ రావు, సంతోష్ మహరణ, ఢిల్లీ బిసాయి కల్య దాసరి శేఖర్ మరియు ఇచ్ఛాపురం జనసేన నియోజకవర్గ నాయకులు పాల్గొనడం జరిగినది.



## వృధాగా పారబోస్తున్న కాంక్రీట్ రోడ్ గుంతలు పూడ్చిన జనసేన

శతఘ్ని న్యూస్: తుమ్మలపాలెం ఎన్.హెచ్.65 రోడ్డు మార్గం పక్కన కాంక్రీట్ లారీ సాంకేతిక లోపం వలన ఆగిపోవడంతో వృధాగా పారబోస్తున్న కాంక్రీట్ ను తుమ్మలపాలెం ఎంపీటీసీ పోలిశెట్టి తేజ లారీ యాజమాన్యంతో మాట్లాడి గుంతలుగా ఉన్న తుమ్మలపాలెం చిన్న కెనాల్ వంతెన్ వద్ద కాంక్రీట్ను పోసి చదును చెయ్యటం జరిగింది. గ్రామస్తులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమంలో స్వచ్ఛందంగా తనతోపాటు పాల్గొన్న తుమ్మలపాలెం జనసైనికులను పోలిశెట్టి తేజ అభినందించి కృతజ్ఞతలు తెలియజేసారు.



## టీబీతో బాధపడుతున్న వ్యక్తికి సహాయమందించిన ఈతపేట జనసేన

శతఘ్ని న్యూస్: ఈతపేట గ్రామంలో శనివారం ఉదయం టీబీ వ్యాధి తో బాధపడుతున్న బత్తిన అప్పారావుకు ఆ గ్రామ జనసేన నాయకుల సహకారంతో రూ. 10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం మరియు బియ్యం బస్తా జనసేన పార్టీ తరపున గ్రామస్తుల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా.. జనసేన నాయకులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేసారు.






SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022




## రైతన్నలకు అండ – జనసేన జెండా: తమేష్ గాలిదేవర



శతఘ్ని న్యూస్: తూర్పుగోదావరి జిల్లా, రెండో విడత “జనసేన కౌలు రైతు భరోసా యాత్ర”లో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న 40 మంది కౌలు రైతుల కుటుంబాలను జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ శనివారం పరామర్శించి, లక్ష రూపాయలు చొప్పున చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఐటి కోఆర్డినేటర్ గాలిదేవర తమేష్ కొనియాడారు. ఇప్పటివరకూ దేశ రాజకీయాల్లో ఏ రాజకీయ పార్టీ చేయనటువంటి కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఐటీ టీంలో పార్టీ కోసం నిస్వార్ధంగా పనిచేసే జనసైనికులు తనని సంప్రదించవలసినదిగా కోరారు.

## ఘనంగా జనసైనికుని జన్మదిన వేడుకలు..

శతఘ్ని న్యూస్: రాయవరం: రాయవరం మండలం, చెల్లూరు గ్రామ జనసైనికుడు కీ.శే. బండి రాంబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వేగుళ్ళ లీలాకృష్ణ తనయుడు యూత్ ఐకాన్ వేగుళ్ళ వీరాజ్ (రాజా బాబు) విచ్చేసి చెల్లూరు గ్రామ జనసైనికుల అధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్స్ నీ పంచారు. అనంతరం ఎంపీటీసీ –1 శ్రీమతి గొల్లపల్లి అనురాధ వెంకట రమణ పంచాయితీ పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి దాలిపర్తి శ్రీనివాసు, పంచాయితీ 1వ వార్డ్ సభ్యులు గళ్ళా సావిత్రి, గరగ ధనలక్ష్మి, వల్లూరి సత్య ప్రసాద్, తలాటం వెంకటేష్, కొండేపూడి ఆనంద్, సుంకర సంతోష్, కొండేపూడి అవినాష్, బండి వీరబాబు, నరేష్, మణికంఠ, పిల్లా రాజేష్, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పుట్టా బాలకృష్ణ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

శతఘ్ని న్యూస్: రాచర్ల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ ఆధ్వర్యంలో అనుమలవీడు గ్రామంలో రంజాన్ మాసం పురస్కరించుకొని 300 మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్త వనిపెంట హేమ శేఖర్, మండల నాయకులు షేక్ సుభాని, నాయబ్ రసూల్, చిన్న కాసిం వల్లి, పార్లపల్లి శ్రీనివాసులు, వై పుల్లారావు, బత్తిని కృష్ణయ్య, లంకా జనార్ధన్, ప్రభాకర్ నాయుడు, యామా రామకృష్ణ, కుప్ప రంగస్వామి, సందు వీరయ్య, ఉలాపు మురళి, టీ నాగేశ్వరరావు, కుంచాల రమణ, ఏ వెంకటేశ్వర్లు, రామ్మోహన్ గంగాధర్, జనసేన కార్యకర్తలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.



## శ్రీ దుర్గాదేవి అమ్మవారి పునః ప్రతిష్ట మహోత్సవంలో బొలియశెట్టి దంపతులు

శతఘ్ని న్యూస్: కొండపల్లి మున్సిపాలిటీ కొత్తగేట్ లో తామరసిరి వినోదిని ఆధ్వర్యంలో ముడు రోజులుగా దుర్గాదేవి అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయి మొదటి రోజు అంకురార్పణ, వాస్తుపూజ, రెండవ రోజు పంచగవ్యాధి, క్షిరాదివాస, జలదివాసములు, అధివసా హోమమలు, మూడోరోజు శ్రీ దుర్గాదేవి సహిత పరివార దేవతల విగ్రహాలు ప్రతిష్ట మంచా అమృత అభిషేకం పూజలు.. నాలుగవ రోజు ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీ దుర్గాదేవి, శివలింగం, నవగ్రహాలు, ప్రతిష్ట చేయబడును ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం శ్రీ దుర్గాదేవి అమ్మవారి పంచామృత అభిషేకం హోమములో పాల్గొన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమానికి బొలియశెట్టి శ్రీకాంత్ విజయదుర్గ దంపతులు 10 వేల రూపాయిలు విరాళం అందించారు. గత 20 సంవత్సరాల నుండి వినోదిని ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజలు చేస్తున్నారు. అమ్మవారి కార్యక్రమానికి తనవంతు సహాయ సహకారాలు కొత్తగేట్ సిరిపురం సురేష్ అందిస్తున్నారు. కొత్తగేట్ భక్తులే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల నుండి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసి దర్శించుకున్నారు.



## పంచాయతీలను చంపేస్తున్న జగన్ రెడ్డి

జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డా. వంపూరు గంగులయ్య




శతఘ్ని న్యూస్: అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు, దేశం అభివృద్ధి చెందాలంటే పల్లెలు అభివృద్ధి చెందాలి. కానీ నేడు వైసీపీ ప్రభుత్వం పల్లెలను అభివృద్ధికి దూరంగా ఉంచుతోందని జనసేన అరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య విమర్శించారు. రేపు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే గ్రామాల అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తాయని కానీ వైసీపీ మాత్రం పల్లెల అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్రాలు సమాన ప్రాతిపదికన నిధులతో గ్రామాలను అభివృద్ధి పరచాల్సింది పోయి ఈ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం కేంద్రం ఇచ్చిన నిధులను కూడా తమ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుండడం అన్యాయని తెలిపారు. గ్రామాలకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తే ఈ ప్రభుత్వం వాటితో పాటు సమాన నిధులు కేటాయించాల్సింది పోయి వాటిని పంచాయతీ ఖాతా నుంచి సర్పంచ్‌ల అనుమతి లేకుండా తీసేసుకుందని విమర్శించారు. గతంలో సర్పంచ్‌కు అన్ని అధికారాలు ఉండేవని కాని నేడు ప్రెసిడెంట్ అధికారాలన్నింటినీ లాగేసుకొని అసమర్థులుగా మిగిల్చిందని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో సర్పంచ్ లుగా గెలిచి ఏడాదైందని ఏ సర్పంచ్ అయినా ఒక్క పని అయినా చేసేరేమో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే చేయడానికి వారి చేతి చిల్లిగవ్వ లేదని పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి పంచాయతీలకు దాపురించిందంటే అది ఈ ప్రభుత్వం నిరంకుశ నిర్ణయాల వలనేనని ఆయన తెలిపారు. ఇలా ఎందుకు చేశారని మీడియా వారు అడిగితే పంచాయతీ రాజ్ శాఖా మంత్రి వింత సమాధానాలు ఇస్తున్నారని, గత టీడీపీ చేసిందే తాము చేసిమని అప్పుడెందుకు వారిని అడగలేదని ఎదురు ప్రశ్నవేశారని ఆక్షేపించారు. తెలుగుదేశం ప్రభుత్వం తప్పులు చేసింది కాబట్టే ప్రజా కోర్టులో శిక్షించబడిందని కానీ వైసీపీని నమ్మి ప్రజలు పట్టం కడితే మీరూ అలాగే చేయడాన్ని ఏమనుకోవాలని ప్రశ్నించారు. వేల మంది వైసీపీ మద్దతుదారులు పంచాయతీ సర్పంచ్‌లుగా ఎన్నికైన వారున్నారని వారెందుకు సీఎంను ఈ విషయంలో నిలదీయలేకపోతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు మాత్రమే వేరేవాటికి మళ్లించి మళ్లీ ఇచ్చిందని నేడు జగన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఆర్థిక సంఘం నిధులతో పాటు సాధారణ నిధులను కూడా దోచుకున్నారని ఆరోపించారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధిస్తామని చెప్పి గెలిచిన జగన్ రెడ్డి సర్పంచ్ అధికారులు, హక్కులను లాగేసుకుంటున్నారన్నారు. పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులను కేటాయిస్తూ ఇప్పటివరకూ పంచాయతీ ఖాతాల నుంచి మళ్లించిన నిధులను వెంటనే తిరిగి చెల్లించాలని జనసేన పాడేరు, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ వంపూరు గంగులయ్య డిమాండ్ చేశారు.


# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

ఆదివారం, 24 ఏప్రిల్ 2022


## యాక్సిడెంట్ అయిన వ్యక్తికి అండగా నిలిచిన జనసేన



శతఘ్ని న్యూస్: గిద్దలూరు నియోజకవర్గం కొమరోలు మండలంలోని బ్రాహ్మణ వీధిలో ఉంటున్న వడ్డెమాను లక్ష్మీనారాయణ గత కొద్ది రోజుల క్రితం యాక్సిడెంట్ అయ్యి రెండు దవడలు ఫ్యాక్చర్, కన్నుకు కూడా గాయం అయింది. అతనికి తండ్రి లేడు అతని తల్లి ఇద్దరు చిన్న చిన్న చెల్లెలు ఉన్నారు. వారికి పెద్దదిక్కుగా కూడా లక్ష్మీనారాయణ సంపాదనతోనే జీవనం సాగిస్తున్నారు. ఇతను వృత్తి రీత్యా డ్రైవర్ దవడలు ఫ్యాక్చర్ కన్ను బాగా లేని పరిస్థితులలో అతను డ్రైవింగ్ చేయలేని స్థితిలో ఉన్నాడని కొమరోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు ఓబులేష్ నాయుడు తెలుపగా విషయం తెలుసుకొని నేనున్నాను మీకు సహాయం చేయడానికి అని హామీ ఇవ్వడం జరిగింది. రంగనాయకులు అతనిని నేను ఆదుకుంటానని ముందుకు వచ్చి దాత జక్కా రంగనాయకులు బీఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి (5000) ఐదువేల రూపాయలు అతనికి శనివారం అందజేయడం జరిగింది. జనసేన నాయకులు తోట సుబ్బారావు చేతులమీదుగా జక్కా రంగనాయకులు ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సంయుక్త కార్యదర్శి గజ్జల కొండ నారాయణ హైదరాబాద్ దిల్సుక్ నగర్ జనసేన నాయకులు కోటిపల్లి వెంకట ప్రసాద్, మల్లారపు వెంకటేశ్వర్లు, శేషాద్రి నాయుడు, జనసేన నాయకులు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన పోలిశెట్టి చంద్రశేఖర్



శతఘ్ని న్యూస్: రామచంద్రపురం రూరల్ తోటపేట గ్రామం వాస్తవ్యులు అల్లం దండమ్మ ఇటీవల స్వర్గస్థులైనారు.. వారి కుమారులు సత్యనారాయణ, శ్రీను, భీమన్నలను, సాక్షి వారివీధి సలాది వెంకన్న బాబు తండ్రి సలాది రాంబాబు ఇటీవల స్వర్గస్థులైనారు. మరియు నున్న వారివీధి పోలిశెట్టి శివ కుమార్ తల్లి వీరరాఘవులు ఇటీవల స్వర్గస్థులైనారు.. వారి కుటుంబసభ్యులను రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించడం జరిగింది.. వారితో పాటు జనసేన నాయకులు అల్లం చంటి, అల్లం పద్మనాభం, కర్రా నాగేశ్వరరావు, వీరుబండి, దుళ్ల కొండ, రాంబాబు నాయుడు తదితర జనసైనికులు ఉన్నారు.

## ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైతులకు జనసేన అండగా ఉంటుంది: దారం అనిత



శతఘ్ని న్యూస్: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గారు పశ్చిమగోదావరి జిల్లా లో చనిపోయిన కౌలు రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి అదేవిధంగా రైతు కుటుంబాల లో ధైర్యం నింపడానికి చేపట్టిన రైతు భరోసా భరోసా యాత్ర కార్యక్రమం విషయం అందరికి తెలిసిందే.. అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకి పవన్ కళ్యాణ్ గారు వస్తున్నారు అన్న విషయం తెలిసి శుక్రవారం ఉదయమే చింతలపూడి నియోజకవర్గం ధర్మాజీ గూడెం వద్ద రోడ్లను పొక్లైనర్లతో తవ్వేస్తుండగా.. జనసేన పీఏసీ చర్మెన్ నాదెండ్ల మనోహర్, జనసేన నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైతులకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు ఎల్లప్పుడూ అండగా వుంటారని చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కుమారుడి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేసిన మనుబోలు శ్రీనివాసరావు



శతఘ్ని న్యూస్: తిరువూరు నియోజకవర్గ పరిధిలోని ఏ కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన తన కుమారుడు మనుబోలు వెంకట ధాత్రేష్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం 300 మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేసిన కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మరియు పూర్వ విద్యార్థులు సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మనుబోలు శ్రీనివాసరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు పుట్టినరోజు వేడుకలు లాంటి సందర్భాలలో పాఠశాలలో గాని దగ్గరలో ఉన్న ఆశ్రమాల్లోగాని వారి పిల్లల్ని తీసుకెళ్లి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం పాఠశాల సిబ్బంది తోటి విద్యార్థిని విద్యార్థులు ధాత్రేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫోటో: చీమలపాడు ఉన్నత పాఠశాలలో పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జనసేన కృష్ణా జిల్లా కార్యదర్శి మనుబోలు శ్రీనివాసరావు కుమారుడు, కుమార్తె.

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు



శతఘ్ని న్యూస్: పెడన, ఆంధ్ర రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు చూస్తుంటే రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు అని స్పష్టంగా అర్థం అవుతోంది. అవగాహన లేని హోంమంత్రి, సమాచారం లేని ముఖ్యమంత్రి. విజయవాడ నగరం నడిబొడ్డున ఓ మానసిక వికలాంగురాలు అత్యాచారానికి గురైన విషయం రాష్ట్రంలో సామాన్యులు కూడా తెలుసు. అలాంటిది మహిళా హోమ్ మినిస్టర్, సాటి మహిళకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకోకపోవడం చాలా దురదృష్టకరం. జగన్ రెడ్డి మంత్రి వర్గానికి ఇప్పటివరకు అధికారాలు మాత్రమే లేవు అనుకున్నాం. నిన్నటి హోమ్ మినిస్టర్ ప్రెస్మీట్ తర్వాత మంత్రులకు అవగాహన కూడా లేదని స్పష్టంగా అర్థమైంది. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు గన్ కంటే ముందు జగన్ వస్తాడు అని జగన్ రెడ్డి భజన బ్యాచ్ ప్రాస కోసం వాడే డైలాగ్ అని జనాలకు అర్థం అయింది. దిశా చట్టం ఓ బూటకం అని అర్థమైంది. దిశ చట్టాన్ని వైసీపీ ప్రచార అస్త్రంగా కాకుండా, మహిళలకు రక్షణ కవచంలా తయారు చేయాలి. గతంలో ఎంతో సమర్థవంతంగా పనిచేసే పోలీస్ శాఖ వైసీపీ ప్రభుత్వం వచ్చినాక అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులెత్తున్నారని ఆరోపణ బలంగా ఉంది. ఇది పోలీస్ వ్యవస్థకు మంచిది కాదు. నిజానికి మొన్న విజయవాడలో జరిగిన సంఘటన విషయంలో పోలీసుల నిర్లక్ష్యం తేటతెల్లమైంది. అత్యాచారానికి గురైన బాధితురాలికి సత్వర న్యాయం జరగాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తుంది. దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని పెడన జనసేన నాయకులు ఎస్ వి బాబు సమ్మెట అన్నారు.

## నర్సంపేట నూతన ఏసీపీ ని కలిసిన జనసేన నాయకులు

శతఘ్ని న్యూస్: వరంగల్, నర్సంపేట నూతన ఏసీపీగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఏ సంపత్ రావు ని జనసేన పార్టీ నర్సంపేట నియోజకవర్గ నాయకులు గౌరవపూర్వకంగా కలిసి పూలబొకే అందించి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకుడు మేరుగు శివ కోటీ యాదవ్ మాట్లాడుతూ ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణకై పోలీసు వారు అందిస్తున్న సేవలలో జనసేన పార్టీ తమవంతు సహకారం అందిస్తుందని, అలాగే జనసేన పార్టీ దృష్టికి వచ్చే ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు వారు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ సందర్భంగా గతంలో ఏసీపీగా పనిచేసి నర్సంపేట ప్రజానీకానికి అమూల్యమైన, విశేష సేవలు అందించిన "ఫణింధర్" కి జనసేన పార్టీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నూతన ఏసీపీ కలిసిన వారిలో యువజన నాయకులు వంగ మధు, ఓర్సు రాజేందర్, రాపోలు సురేష్, ఎలబోయిన డేవిడ్ రాజు, ఇరుసం యాకూబ్, గంగుల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

